మానవహక్కుల వేదిక బహిరంగ సభ

## ఈ తుదిఘడియలను ఆపుదాం

# రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని కాపాడుకుందాం

రామగుండం ఎరువుల కర్మాగారానికి తుదిఘడియలు దగ్గరికొచ్చాయని బిఐఎఫ్ఆర్ కొన్నాళ్ళ క్రితం ప్రకటించడంతో తెలంగాణ బాగుకోరేవారి గుండెల్లో రాయిపడింది.

వెయ్యిమందికి పైగా రెగ్యులర్ కార్మికులకూ మరో అంతమంది కాంట్రాక్ట్ కార్మికులకూ ఉపాధి కల్పించిన ఈ ఫ్యాక్టరీ రామగుండంను తెలంగాణలోని ప్రధాన పారిశ్రామిక కేంద్రాలలో ఒకటిగా మలచడానికి తోడ్పడింది. తెలంగాణలోని అన్ని పారిశ్రామిక కేంద్రాలలాగ దీనిలో కూడా తెల్లబట్టల ఉద్యోగాలు అత్యధికంగా బయటివారికే దక్కినప్పటికీ స్థానికులకు కొంత మేరకు ఉపాధి, అంతకుమించిన ఆశ కల్పించింది.

రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన 'ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' (ఎఫ్‌సిఐ) యాజమాన్యంలోని సంస్థ. ఎఫ్‌సిఐ యాజమాన్యంలో రామగుండంలోనే కాక సింద్రి, తాల్చేర్, గోరఖ్‌పూర్‌లలోనూ ఎరువుల ఫ్యాక్టరీలున్నాయి. ఒక్క రామగుండం ఫ్యాక్టరీయే కాక మొత్తంగా ఇప్పుడు ఎఫ్‌సిఐకే తుదిఘడియలు దగ్గరకు వచ్చాయి.

ఎందువల్ల? కేంద్ర ప్రభుత్వ సంస్థగా ఈ ఎరువుల కర్మాగారాల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన కేంద్రప్రభుత్వం ఎఫ్‌సిఐని కాపాడడానికి చేయగల ప్రయత్నాలన్నీ చేసినప్పటికీ దానిని బతికించడం సాధ్యం కాకపోయినట్టయితే ప్రభుత్వాన్ని మనమేమీ అనలేకపోవచ్చు. పెట్టుబడిదారీ వ్యవస్థలో పారిశ్రామిక సంస్థలు శాశ్వతంగా ఉండవు. అయితే సంక్షోభంలో పడ్డప్పుడు సంస్థను కాపాడడానికి ప్రయత్నం సహితం చేయని యజమాని పెట్టుబడిదారీ మార్కెట్‌ను నిందించడం సబబు కాదు.

ఎఫ్‌సిఐని 1992 నవంబర్ 6వ తేదీన 'ఖాయిలా పరిశ్రమ'గా బిఐఎఫ్ఆర్ గుర్తించింది. అప్పటి నుండి తొమ్మిది సంవత్సరాలుగా ఎఫ్‌సిఐ చావుబతుకులు బిఐఎఫ్ఆర్ చేతిలో ఉన్నాయి. బిఐఎఫ్ఆర్ అంటే ఖాయిలా పడ్డ పారిశ్రామిక సంస్థలను పునరుద్ధరించడానికీ అందుకోసం వాటిని పునర్వ్యవస్థీకరించడానికీ అధికారాలు ఉన్న సంస్థ. మరి పునరుద్ధరించమని ఎఫ్‌సిఐను బిఐఎఫ్ఆర్ ముందు పెడితే తొమ్మిదేళ్ళు ఆ పని చేయకుండా ఇప్పుడు మూసేస్తామని నిర్ణయించడంలో అర్థమేమిటి? తొమ్మిదేళ్ళుగా ఆ సంస్థ ఉంటుందో పోతుందో తెలియక బిక్కుబిక్కుమంటూ బతుకుతున్న కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబసభ్యుల గతేమిటి? ఆ సంస్థ నెలకొల్పిన ఫ్యాక్టరీల పరిసరాలలో చిన్నా చితక వ్యాపారాలు పెట్టుకుని అది బాగుంటే తామూ బాగుంటామని ఆశలు పెంచుకున్న జనం సంగతేమిటి? అక్కడొక ఫ్యాక్టరీ ఉందన్న ధీమాతో కష్టపడి చదువుకొని అందులో ఉద్యోగం సంపాదించుకుందామని ఆశలు పెట్టుకున్న విద్యార్థుల సంగతేమిటి?

బిఐఎఫ్ఆర్ రికార్డులు చూస్తే ఎఫ్‌సిఐ విషయంలో ఎవరిని తప్పుపట్టాలో అర్థం అవుతుంది. రామగుండం ఫ్యాక్టరీ గురించే మాట్లాడుకుంటే, ఈ తొమ్మిది సంవత్సరాలలో ఏ రోజూ కూడా ఆ ఫ్యాక్టరీని పునరుద్ధరించడం సాధ్యం కాదని బిఐఎఫ్ఆర్ అనలేదు. పునరుద్ధరణ ప్రతిపాదనలు పెట్టమని బిఐఎఫ్ఆర్ నియమించిన ఆపరేటింగ్ ఏజెన్సీ కూడా ఆ మాట ఏ రోజూ అనలేదు. ఆ ఫ్యాక్టరీకి సాంకేతిక సమస్యలు లేకపోలేదుగానీ వాటికి అసలే పరిష్కారం లేదని ఎవరూ అభిప్రాయపడడం లేదు.

అయినప్పటికీ మూసేసే పరిస్థితి ఎందుకొచ్చిందంటే కేంద్రప్రభుత్వానికే అందులో ఆసక్తి లేదు. ఈ తొమ్మిది సంవత్సరాలలో ఏ ఒక్క రోజూ కేంద్రప్రభుత్వం ఎఫ్‌సిఐ కేసు విచారణలో ఆసక్తి తీసుకోలేదు. ఆపరేటింగ్ ఏజెన్సీ పెట్టిన ప్రతిపాదనలకు స్పందించలేదు. కనీసం తన అభిప్రాయాన్ని బిఐఎఫ్ఆర్‌కు వివరించి చెప్పనూ లేదు. బిఐఎఫ్ఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని మందలించింది. విసుక్కుంది. తిట్టింది కూడా. అయినప్పటికీ వారి అనాసక్తి చెక్కు చెదరలేదు.

అందరూ ఆహ్వానితులే

(HRF)

## బహిరంగ సభ

31 జులై మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సాయంత్రం 6.00 గంటలకు.

### వక్తలు

**సిహెచ్ నర్సయ్య**
జనరల్ సెక్రటరీ, ఎఫ్‌సిఐ ఉద్యోగుల సంఘం

**సోమారం సత్యనారాయణ**
చైర్‌పర్సన్, రామగుండం మునిసిపాలిటీ

**ఎ.ఆర్. ఖాన్**
ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగుల సమాఖ్య సెక్రటరీ- జనరల్

**కోదండరాం**
మానవహక్కుల వేదిక

**బాలగోపాల్**
మానవహక్కుల వేదిక

బిడ్డ బతికేదేగానీ కన్నవారికి ఆసక్తి లేదు కాబట్టి గొంతు నులిమేస్తున్నానని చివరికి బిఐఎఫ్‌ఆర్ ప్రకటించింది.

పారిశ్రామిక అభివృద్ధిలో ప్రభుత్వం కీలకపాత్ర నిర్వహించాలని భావించిన రోజులలో ఎఫ్‌సిఐ వంటి సంస్థలు పుట్టాయి. దేశ అభివృద్ధికి వ్యవసాయ అభివృద్ధి కీలకమనీ వ్యవసాయ అభివృద్ధికి ఎరువుల ఉత్పత్తిని పెంచడం అవసరమనీ గుర్తించి, ఆయా ప్రాంతాలలో అందుబాట్లో ఉన్న ముడిసరుకులను ఆధారం చేసుకుని కేంద్ర ప్రభుత్వం ఎరువుల కర్మాగారాలు నెలకొల్పింది. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ సమీపంలోని గోదావరిఖనిలో ఉత్పత్తి అయ్యే బొగ్గును ఆధారం చేసుకున్న ప్రయోగాత్మక ఎరువుల కర్మాగారం. ఆనాడు ఈ ఫ్యాక్టరీలను కేవలం లాభాల దృష్టితో చూడలేదు. అంటే అవి శాశ్వతంగా నష్టాలలో ఉండాలని కోరుకున్నారని కాదుగానీ, స్థానిక వనరుల వినియోగం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, గ్రామీణ నిరుద్యోగులకు ఉపాధి కల్పన, కొత్త సాంకేతిక ప్రయోగాలు, ఆదర్శవంతమైన కార్మిక యాజమాన్య సంబంధాలు మొదలయిన అనేక ఆదర్శాలను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రభుత్వరంగ సంస్థలను నెలకొల్పారు. ఈ ఆదర్శాల వెలుగులో నడుపుతూ అదే సమయంలో తగు మాత్రం లాభాలు పొందితే చాలుననుకున్నారు. ఈ సంస్థల పెట్టుబడి వ్యాప్తికి కావలసిన మూలధనం లాభాల నుండి రాకపోతే ప్రభుత్వ బడ్జెట్ నుండి ఇవ్వడంలో తప్పేమీ లేదనుకున్నారు.

ఈ విధానం కొంత సత్ఫలితాన్ని ఇచ్చింది. అవినీతి, బాధ్యతారాహిత్యం అడ్డం రాకుంటే ఇంకా కొంత ఇచ్చేదే. అయితే అంతలో మన పాలకులకు ఈ బాధ్యత పట్లనే ఆసక్తి పోయింది. 'ప్రభుత్వం పారిశ్రామిక సంస్థలు నెలకొల్పడమెందుకు? వాటిని కేవలం ఆర్థికంగా లాభదాయంగానే కాక సామాజికంగా ఆదర్శవంతంగా కూడా నడపడమెందుకు? వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, రిజర్వేషన్లు, కార్మికులకు వేతనస్కేళ్ళు, ఈ బాదరబందీ అంతా ఎందుకు? ఈ బరువు దించేసుకొని ప్రైవేట్‌రంగానికి అప్పగించేసి హాయిగా పోలీస్‌స్టేషన్లు మాత్రం నడుపుకుంటే సరిపోలేదా?' అని ఒక దశాబ్దం పైగా ప్రభుత్వాలు అనుకుంటున్నాయి. ప్రపంచబ్యాంకు ఆ సలహాయే ఇస్తున్నది.

కాబట్టి, ప్రభుత్వ రంగ సంస్థలు నెలకొల్పినప్పుడు పెట్టుకొని ప్రమాణాలను ఇప్పుడు తీసుకొచ్చి వాటిని పనికిరానివిగా నిందిస్తున్నారు. 'ఇవి లాభాలు సంపాదించడం లేదు, పెట్టుబడి కోసం బడ్జెట్ మీద ఆధారపడుతున్నాయి, కార్మికులకు మరీ ఎక్కువ జీతాలిస్తున్నాయి' అని నిందలు వేస్తూ మూసేస్తున్నారు. వాటిని నెలకొల్పినప్పుడు ఉద్దేశించిన ప్రమాణాలు ఇవి కావే- ఇప్పుడు మూసేయడానికి ఈ ప్రమాణాలు అరువు తెచ్చుకోవడం ఏం న్యాయం? అన్న ప్రశ్నకు ప్రభుత్వం దగ్గర జవాబు లేదు. ఎఫ్‌సిఐని కాపాడుకోవాలని కేంద్రప్రభుత్వానికి పట్టింపు లేకపోవడానికి గల కారణం ఇదే. అందుకే వారు బిఐఎఫ్‌ఆర్ ఎదుట సక్రమంగా హాజరుకారు, ఆపరేటింగ్ ఏజెన్సీ ప్రతిపాదనలకు స్పందించరు, తమ వైపు నుండి ఏ ప్రతిపాదనలూ- మూసివేయడం తప్ప-పెట్టరు.

ప్రభుత్వరంగ సంస్థలన్నీ చాలా బాగున్నాయనీ వాటి మీద ఈగవాలినా సహించకూడదనీ చెప్పడం మా ఉద్దేశ్యం కాదు. వాటిలో అవినీతి, బాధ్యతారాహిత్యం మీది నుండి కింది దాకా ఆవరించి ఉన్నాయి. కార్మికులకు సహితం అందులో భాగం లేకపోలేదు. అయినప్పటికీ, సమగ్రమైన సామాజిక ఆర్థిక అభివృద్ధిలో అంతర్భాగంగా పారిశ్రామిక అభివృద్ధిని చూడాలనే అవగాహన సూత్రప్రాయంగా సరైనదనీ దానిని కాపాడుకోవాలనీ అనుకుంటున్నాము. పారిశ్రామిక అభివృద్ధి కేవలం యాజమాన్యాల లాభాలను ప్రమాణంగా పెట్టుకొని నడిచేటట్టయితే అది సమాజంలో సంపద కేంద్రీకరణకూ అన్ని రకాల అసమానతలు పెరగడానికీ దోహదపడుతుందని ప్రజలు గుర్తించాలని కోరుతున్నాము.

కేంద్రప్రభుత్వం నిర్వాకం సంగతి ఇట్లా ఉండగా మన బాబుగారి సంగతేమిటి? ఆయన ఇప్పటి దాకా ఒక్కసారి కూడా రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ గురించి మాట్లాడలేదు. ఒక పక్క దానిని మూసేయొద్దన్న ఆందోళన జరుగుతుండగా ఆయన నెల్లూరులో ప్రైవేట్‌రంగంలో ఎరువుల ఫ్యాక్టరీకి అనుమతి ఇయ్యబోతున్నట్లు ప్రకటించాడు. దాని బదులు కేంద్రం నుండి రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని రాష్ట్రప్రభుత్వం తీసుకొని బాగుచేసి నడపొచ్చుగదా?

పాలకులకే వదిలేస్తే ఆ కర్మాగారం త్వరలో మూతబడుతుంది కాబట్టి ప్రజలే దానిని కాపాడే విషయంలో చొరవ తీసుకోవాలని ఆహ్వానిస్తూ-

హైదరాబాద్,
27.07.01.

-మానవహక్కుల వేదిక

(HRF)